క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

హాలియా : మరమ్మతుల కారణంగా ఆదివారం హాలియా పట్టణంలోని వివిధ ప్రాంతాలకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏఈ ధనరాజ్ కుమార్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. హాలియా టౌన్ ఫీడర్ పరిధిలోని బొడ్రాయి బజార్, రెడ్డి కాలనీ, అంగడి బజారు, వీరయ్యనగర్, సాయి ప్రతాప్ నగర్, అరుశ్రీ వెంచర్, చర్చి బ్యాక్ సైడ్ వెంచర్, ఎస్‌బీఐ తదితర ప్రాంతాలకు ఉదయం 9గంటల నుంచి 11 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని వినియోగదారులు గమనించి సహకరించాలని కోరారు.

విలేకరిపై దాడికి యత్నం

వేములపల్లి : ఓ విలేకరిపై దాడికి యత్నించిన ఘటన మండలంలోని రావులపెంట గ్రామ శివారులో శనివారం చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళ్తే మండలంలోని రావులపెంట గ్రామ సమీపంలోని పాలేరువాగు నుంచి ట్రాక్టర్ల ద్వారా అక్రమంగా ఇసుకను తరలిస్తుండగా స్థానికుల సమాచారం మేరకు అక్కడికి చేరుకున్న పోలీసులు వాటిని స్వాధీనం చేసుకుంటుండగా ఓ దినపత్రిక విలేకరి వాటిని ఫొటోలు తీశాడు. ఆ సమయంలో అక్కడికి చేరుకున్న ఇసుక ట్రాక్టర్‌కు చెందిన వ్యక్తి సదరు విలేకరి దుర్భాషలాడుతూ దాడికి యత్నించాడు. దీంతో పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. ఈ విషయమై స్థానిక ఎస్‌ఐ డి.వెంకటేశ్వర్లును వివరణ కోరగా దాడికి యత్నించిన వారిపై చర్యలు తీసుకుంటామని తెలిపారు.

ముమ్మరంగా రేషన్‌కార్డుల సర్వే



సర్వే వివరాలను తెలుసుకుంటున్న ఆర్‌ఐ సత్యనారాయణ

మిర్యాలగూడ టౌన్ : మిర్యాలగూడ పట్టణ, మండలంలో రేషన్ కార్డుల కోసం ఆన్‌లైన్‌లో దరఖాస్తులు, ప్రజాపాలనలో రేషన్‌కార్డుల కోసం చేసుకున్న దరఖాస్తుల ఇంటింటి సర్వేను శనివార ముమ్మరంగా చేపట్టారు. ఆన్‌లైన్‌లో రేషన్ కార్డుల కోసం దరఖాస్తులు చేసుకుంటే నేరుగా ఇంటి వద్దకు వెళ్లి సర్వేను చేపట్టి పూర్తి వివరాలను అడిగి తెలుసుకుంటున్నారు. ఈ సందర్భంగా ఆర్‌ఐ బాణావత్ సత్యనారాయణ, ఠాగూర్ రామకృష్ణలు సర్వే చేపట్టారు. అయితే మున్సిపాలిటీలో 48వార్డుల నుంచి ఆన్‌లైన్ దరఖాస్తులు చేసుకున్న వారు 1029 కాగా సుమారు 700వరకు సర్వే పూర్తయిందని, అదే విధంగా ప్రజాపాలనలో కూడా 3వేల 850మంది దరఖాస్తులు చేసుకున్నట్లు తెలిపారు.

సామూహిక అనగాష్టమి వ్రతాలు

మిర్యాలగూడ టౌన్ : పట్టణ సమీపంలోని రైల్వే కాలనీలోని శ్రీసాయిదత్తాశ్రమంలో శనివారం సామూహిక అనగాష్టమి వ్రతాలను ఘనంగా నిర్వహించారు. ముందుగా తెల్లవారు ఝూమున దత్తాత్రేయుడికి ప్రత్యేకంగా అభిషేకాలను నిర్వహించిన ప్రత్యేక పూజలను చేశారు. అనంతరం శ్రీఅనగాష్టమి వ్రతాలతో పాటు ప్రత్యేక పూజలను జరిపారు. భక్తులు ఈ వ్రతాలను పరిసరాల నుంచి తరలివచ్చారు. అనంతరం తీర్థ ప్రసాదాలు తీసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షుడు గుండా శ్రీనివాస్, ఉపాధ్యక్షులు ప్రతాప్, ప్రధాన కార్యదర్శి నరేందర్, కోశాధికారి మట్టయ్య, జానకిరాముడు, విక్రం, వాసు, అంజిబాబు, పద్మ, భాగ్యలక్ష్మి, సీత, శారద, కల్యాణి, భవాని తదితరలు పాల్గొన్నారు.

మిరపకు మద్దతు ధర కల్పించాలి



కొత్తగూడెంలో రైతులతో మాట్లాడుతున్న సీపీఎం నాయకులు

పెద్దవూర : మిరపకు క్వింటాకు రూ.25వేల మద్దతు ధర ప్రకటించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు చినపాక లక్ష్మీనారాయణ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సీపీఎం పోరుబాటలో భాగంగా మండలంలోని కొత్తగూడెం గ్రామంలో మిరప రైతులను కలిసి వారి సమస్యలను తెలుసుకుని మాట్లాడారు. ఎకరాకు రూ.2.5లక్షలకు పైగా పెట్టుబడి పెట్టి ఆరుగాలం శ్రమించి సాగు చేసి పండించిన మిరపకు మద్దతు ధర లేక ఎకరాకు రైతు లక్షన్నర రూపాయలకు పైగా నష్టపోవాల్సిన పరిస్థితి దాపురించిందన్నారు. పండించిన పంట కూలీలకు సరిపోవడం లేదని పేర్కొన్నారు. రైతు సంక్షేమమే ధ్యేయమని గొప్పలు చెప్పుకునే రేవంత్‌రెడ్డి సర్కార్ మిర్చిరైతులు అన్నమో రామచంద్రా అల్లాడుతుంటే పట్టించుకునే పాపాన పోలేదని విమర్శించారు. ఈ కార్యక్రమంలో సీపీఎం మండల కార్యదర్శి దుబ్బ రామచంద్రయ్య, మండల నాయకులు ఎస్‌కే బషీర్, చిరు నాగార్జున, దోరెపల్లి మల్లయ్య, తరి రామకృష్ణ, పరమేష్ తదితరులు పాల్గొన్నారు.

హలో.. ఎల్‌ఆర్‌ఎస్ ఫీజు చెల్లించండి

- దరఖాస్తుదారులకు అధికారుల ఫోన్లు
- ఫీజు వసూళ్లలో బిజీగా వార్డు ఆఫీసర్లు
- గడువులోగా ప్రక్రియ పూర్తయ్యేనా

దేవరకొండ : లే అవుట్ రెగ్యులరైజేషన్ స్కీం (ఎల్ఆర్ఎస్) ప్రక్రియ ఈనెల 31లోగా పూర్తి చేయాలనే ప్రభుత్వ ఆదేశాల మేరకు మున్సిపల్ అధికారులు చర్యలు చేపట్టారు. గడువులోగా ఫీజు చెల్లిస్తే ఫీజులో 25శాతం రాయితీ కల్పిస్తామని ప్రభుత్వం ఇప్పటికే ప్రకటించిన విషయం తెలిసిందే. ఫీజు చెల్లించి రాయితీ పొందడంపై అధికారులు దరఖాస్తుదారులకు అవగాహన కల్పిస్తూ ఫీజు వసూళ్లు చేస్తున్నారు. స్వయంగా దరఖాస్తుదారులకు అధికారులు ఫోన్ చేసి ఫీజు చెల్లించాలని కోరుతున్నారు. మున్సిపల్ అధికారులు వార్డు ఆఫీసర్లకు ఈ బాధ్యతలు అప్పగించగా వారు ఫీజు చెల్లింపులపై దృష్టి సారించారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు దరఖాస్తుదారులకు ఫోన్ చేసి ప్లాట్ల రెగ్యులరైజ్ చేసుకోవాలని సూచిస్తున్నారు. రాయితీ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరుతున్నారు.

వార్డు ఆఫీసర్లకు బాధ్యతలు

ఎల్‌ఆర్‌ఎస్ దరఖాస్తుల పరిశీలన ప్రక్రియ నాలుగేళ్లుగా పెండింగ్‌లో ఉంది. దీన్ని గుర్తించిన రాష్ట్ర ప్రభుత్వం ప్రక్రియను వేగవంతం చేసేందుకు చర్యలు చేపట్టింది. అక్రమ లే అవుట్లలోని పదిశాతం ప్లాట్లని అమ్ముకొని, అమ్ముడుపోకుండా మిగిలిన వాటన్నంటికీ ప్రభుత్వం రిజిస్ట్రేషన్ చేసుకునే అవకాశాన్ని కల్పించిన సంగతి విధితమే. గతంలో దరఖాస్తు చేసుకోని వారికి కూడా అవకాశం కల్పించింది. 25శాతం రిబేట్ కూడా ప్రకటించడంతో అధికారులు రెగ్యులర్‌గా ఎల్‌ఆర్‌ఎస్‌పై సమీక్షిస్తూ ముందుకు వెళ్తున్నారు. అందులో భాగంగా గడువులోగా ప్రక్రియను పూర్తి చేసేందుకు చర్యలు చేపట్టారు. ఇప్పటి వరకు దేవరకొండ మున్సిపాలిటీ పరిధిలో 2814 దరఖాస్తులను అధికారులు ఆమోదించారు. వారంతా ఫీజు చెల్లించేలా చూడాలని మున్సిపల్ అధికారులు ఎడుగురు వార్డు ఆఫీసర్లకు బాధ్యతలు అప్పగించారు. ఒక్కొక్కరికీ 400వందల దరఖాస్తులు ఇచ్చి వాటి యజమానులతో ఫీజు చెల్లించేలా చూడాలని నిర్ణయించారు.



మున్సిపల్ కార్యాలయానికి ఎల్‌ఆర్‌ఎస్ ఫీజు చెల్లించేందుకు వచ్చిన దరఖాస్తుదారులు

గడువులోగా పూర్తయ్యేనా..

మున్సిపాల్టీ పపరిధిలో 3422 దరఖాస్తులు ఆమెదించగా ఇప్పటి వరకు కేవలం 65 మంది మాత్రమే ఫీజు చెల్లించినట్లు అధికారులు పేర్కొంటున్నారు. మున్సిపల్ అధికారులు, సిబ్బంది యజమానులకు ఫోన్ చేసి ప్లాట్లను లరెగ్యులరైజ్ చేసుకునేందుకు గడవులోగా ఫీజు చెల్లించి రాయితీ పొందాలని సూచిస్తున్నారు. పలువురు తమ సందేహాలను నివృత్తి చేసుకునేందుకు మున్సిపల్ కార్యాలయానికి వస్తున్నట్లు తెలుస్తుంది. ఫీజు చెల్లించి రాయితీ పొందేందుకు ఇంకా వారం రోజులు మాత్రమే గడువు ఉండగా ఇంకా ఎంతమంది ఫీజు చెల్లిస్తారోనన్న ప్రశ్నలు తలెత్తుతున్నాయి.

గడువులోగా చెల్లించి రాయితీ పొందాలి



ఎల్‌ఆర్‌ఎస్ దరఖాస్తుదారులు ప్రభుత్వం విధించిన గడువులోగా ఫీజు చెల్లించి 25శాతం రాయితీ పొందాలి. దరఖాస్తుదారుల నుంచి ఫీజు చెల్లింపుకుగాను ఇప్పటికే వార్డుల వారిగా అధికారులను నియమించి యజమానులను చైతన్య పరుస్తున్నాం. ఈ అవకాశాన్ని దరఖాస్తుదారులు సద్వినియోగం చేసుకోవాలి.

– వై.సుదర్శన్, కమిషనర్, దేవరకొండ

ఆస్తి పన్ను చెల్లించి సహకరించండి

- మున్సిపల్ కమిషనర్ మహ్మద్ యూసుఫ్

మిర్యాలగూడ టౌన్ : ఈనెల 31వ తేదీలో ఆర్థిక సంవత్సరం ముగుస్తున్నందునా ఆస్తి పన్ను బకాయిదారులు పూర్తిస్థాయిలో పన్ను చెల్లించి పట్టణాభివృద్ధికి సహకరించాలని మున్సిపల్ కమిషనర్ మహ్మద్ యూసుఫ్ కోరారు. శనివారం మొండి బకాయిదారుల దుకాణాలు, గృహాలు సీజ్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈనెల 21న మిర్యాలగూడ సబ్ కలెక్టర్ నారాయణ్ అమిత్ ఆధ్వర్యంలో వంద మంది మొండి బకాయిదారులకు సంబంధించిన షాపులు, బంకులు సీజ్ చేయడంతో స్పందించిన వారు ఒక్కరోజే నగదు రూపంలో 32లక్షల 47 వేల రూపాయల వసూలు కాగా బకాయిదారులు ఆస్తి పన్ను చెల్లించకుంటే ఆస్తులను జప్తి చేయనున్నట్లు తెలిపారు.ఏప్రిల్‌లో ఆస్తి పన్నుల విషయంలో సీరియస్‌గా ఉంటుందన్నారు. ఆస్తి పన్ను సకాలంలో చెల్లించి సహకరించాలని కోరారు. అదే విధంగా పలువురు మొండి బకాయిదారులకు రెడ్ నోటీసులు కూడా మరోసారి ఇవ్వనున్నట్లు తెలిపారు. ఆయన వెంట మున్సిపల్ ఆర్‌ఓ జ్ఞానేశ్వరీ, ఆర్‌ఐలు సాజి, సాంబయ్య, టీపీఎస్ అంజయ్య, శానిటరీ ఇన్‌స్పెక్టర్ వెంకటరమణలతో పాటు వార్డు ఆఫీసర్లు, బిల్ కలెక్టర్‌లతో పాటు మున్సిపల్ సిబ్బంది తదితరులున్నారు.



కమిషనర్‌కు ఆస్తి పన్ను చెక్కు అందజేస్తున్న బకాయిదారుడు

పొరపాట్లు లేకుండా సమన్వయంతో పనిచేయాలి



సామాజిక తనిఖీలో మాట్లాడుతున్న డీఆర్‌డీఏ ఏపీడీ నవీన్ కుమార్

త్రిపురారం : ఉపాధి హామీ పథకం అమలులో ఎలాంటి అవకతవకలు జరగకుండా ఉండాలని, ప్రతి ఏటా పదే పదే పొరపాట్లు లేకుండా సిబ్బంది సమన్వయంతో పనిచేయాలని డీఆర్‌డీఏ ఏపీడీ నవీన్ కుమార్ అన్నారు. శనివారం మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయం ముందు మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో 14 విడత సామాజిక తనిఖీ కార్యక్రమంలో ప్రజా వేదిక కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మండలంలోని 32 గ్రామ పంచాయతీలకు సంబంధించి 2023 ఎప్రిల్ నుంచి 2024 మార్చి వరకు రూ. 4.30కోట్ల పనులకు సామాజిక తనిఖీ చేశారు. పలు గ్రామాల్లో అవకతవకలు జరిగినట్లు గుర్తించారు. ఉపాధి హామీ, ఫారెస్ట్ పనులకు సంబంధించి పలువురు సిబ్బంది నుంచి జరిగిన పొరపాట్లకు రూ. 85,477 రికవరి చేయగా రూ. 17 వేలు జరిమానా విధించారు. ఈ సందర్భంగా ఏపీడీ నవీన్ కుమార్ మాట్లాడుతూ.. ఉపాధి హామీ పథకంలో జీరో పెండింగ్ బిల్లుగా జిల్లాను ముందు స్థానంలో ఉంచాలన్నారు. సమాజిక తనిఖీ కార్యక్రమానికి కూలీలు హజరుకాలేదు. దీంతో అధికారులు గ్రామాల్లో తనిఖీ చేసిన నివేదికలు చదివి వినిపించి మమా అనిపించారు. ఈ కార్యక్రమంలో విజిలెన్స్ డీటీఓ వేణుగోపాల్ రావు, ఎస్‌క్యూసి ఫసుద్దీన్, త్రిపురారం ఎంపీడీఓ విజయ కుమారి, ఎస్‌టీఎమ్ నరేందర్, ఏపీఓ శ్యామల, పీఆర్ఏఈ శ్రీనివాస్, అడవిదేవుల పల్లి ఏపీఓ సూర నాయక్, ఎస్ఆర్‌పీ వెంకన్న, కొడిరెక్క రాజేంద్ర కుమార్, టీఏలు, ఫీల్డ్ అసిస్టెంట్‌లు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

రైతులు నీటి లభ్యతను పెంపొందించుకోవాలి

- డీఆర్‌డీఓ శేఖర్‌రెడ్డి

దేవరకొండ : రైతులు నీటి లభ్యతను పెంపొందించుకొని వ్యవసాయం సాగు చేయాలని డీఆర్‌డీఓ శేఖర్‌రెడ్డి అన్నారు. శనివారం దేవరకొండ మండలం ముదిగొండలో వాటర్‌షెడ్ యాత్రను ఆయన జెండా ఊపి ప్రారంభించారు. అనంతరం రైతులతో ఏర్పాటు చేసిన అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. జల సంరక్షణతో నీటి లభ్యతను పెంపొందించుకోవచ్చని ఆయన సూచించారు. రైతులు తమ పొలాల్లో నీటిని వృథాకాకుండా ఉండేందుకు కట్టలు నిర్మించి నీటి వృథాను అరికట్టాలన్నారు. నీటిని నిల్వ ఉంచడం ద్వారా గ్రౌండ్ లెవెల్‌లో నీటి నిల్వలు పెరుగుతాయని తద్వారా బోర్లు సైతం రీఛార్జ్ అవుతాయన్నారు. నీటి వృథాను అరికట్టి భూమిలో నీటి సామర్థ్యాన్ని పెంచుకోవడం ద్వారా వ్యవసాయానికి ఉపయుక్తంగా ఉంటుందని ఆయన సూచించారు. భూమిలో తేమ తగ్గకుండా ఉండేందుకు గాను పొలాల్లో కట్టలు నిర్మించుకోవడం తప్పనిసరి అని ఆయన పేర్కొన్నారు. ఆయా శాఖల ఆధ్వర్యంలో స్టాళ్లను ఏర్పాటు చేశారు. దేవరకొండ ఎంపీడీఓ డానియల్ అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో అడిషనల్ డీఆర్‌డీఓ శారద, ఏపీడీ బాలకృష్ణ, అగ్రికల్చర్, హార్టికల్చర్, వివిధ శాఖల అధికారులు ఉన్నారు.



మాట్లాడుతున్న శేఖర్‌రెడ్డి

ప్రభుత్వ దిష్టిబొమ్మ దహనం

మిర్యాలగూడ అర్బన్ : సమస్యలు పరిష్కరించాలని అసంఘటిత రంగం కార్మికులు ఆందోళనకు సిద్ధం కాగా ప్రభుత్వం పోలీసులతో నాయకులను ముందస్తు అరెస్టులు చేయడాన్ని కండిస్తూ శనివారం మిర్యాలగూడలో ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా హమాలీ ఫెడరేషన్ జిల్లా అధ్యక్షుడు తిరుపతి రామ్మూర్తి, సీఐటీయూ జిల్లా నాయకులు మల్లు గౌతంరెడ్డి మాట్లాడుతూ.. సమస్యల పరిష్కారం కోసం కార్మికులు ఆందోళనకు చేసేందుకు వెళ్తున్న నాయకులను అరెస్టు చేయడం సరైంది కాదన్నారు. అక్రమ అరెస్టులతో ఉద్యమాలను అణచివేసేందుకు ప్రభుత్వం ప్రయత్నిస్తుందని ఆరోపించారు. అసంఘటిత రంగం కార్మికుల సమస్యలను పరిష్కరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు గుణగంటి రామచంద్ర, దానంగాలయ్య తదితరులు పాల్గొన్నారు.



దిష్టిబొమ్మను దహనం చేస్తున్న హమాలీ సంఘం నాయకులు

వేసవిలో తాగునీటి ఎద్దడిని నివారించాలి

మిర్యాలగూడ : ప్రస్తుత వేసవికాలంలో దామరచర్ల మండలంలోని అన్ని గ్రామాల్లో తాగునీటి ఎద్దడి తీవ్రంగా ఉందని వెంటనే అధికారులు తాగునీటి సమస్యలను పరిష్కరించాలని సీపీఎం మండల కార్యదర్శి మాలోతు వినోద్‌నాయక్ అన్నారు. సీపీఎం పోరుబాట కార్యక్రమంలో భాగంగా శనివారం దామరచర్ల మండల కేంద్రంలోని ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఎంపీడీఓ కార్యాలయంలో వినతిపత్రం అందజేసి మాట్లాడారు. గ్రామల్లో చెడిపోయిన బోర్లను, చేతిపంపసులను తక్షణమే మరమ్మతులు చేపట్టాలని, మిషన్ భగీరథ నీటిని రోజుకు రెండు పూటలు అందించాలన్నారు. వేసవిలో విద్యుత్ కోతలు లేకుండా అధికారులు చర్యలు చేపట్టాలన్నారు. లేనట్లయితే ఎంపీడీఓ కార్యాలయం ఎదుట ధర్నా చేపడ్తామన్నారు. ఈ కార్యక్రమంలో దయానంద్, పాషానాయక్, కోటిరెడ్డి, ఎర్రనాయక్, ఖాజా మోహినొద్దిన్, సుబాని తదితరులు పాల్గొన్నారు.



దామరచర్ల ఎంపీడీఓ కార్యాలయంలో వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

సుదీర్ఘ పోరాటంతోనే ఎస్సీ వర్గీకరణ బిల్లు



పెద్దవూర : కృష్ణమాదిగ చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న నాయకులు

పెద్దవూర : ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణమాదిగ మడమ తిప్పకుండా సుదీర్ఘ కాలం రాజీలేని పోరాటం చేయడం ద్వారానే ఎస్సీ వర్గీకరణ బిల్లు తెలంగాణ రాష్ట్ర అసెంబ్లీలో ఆమోదం పొందిందని ఎంపీటీసీల ఫోరం మాజీ అధ్యక్షుడు పులిమాల కృష్ణారావు, ఎంఎస్‌పీ రాష్ట్ర నాయకుడు ఆడెపు నాగార్జునమాదిగలు అన్నారు. శనివారం ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో మండల కేంద్రంలో మంద కృష్ణమాదిగ చిత్రపటానికి పాలాభిషేకం చేసి మాట్లాడారు. అసెంబ్లీలో ఎస్సీ వర్గీకరణ బిల్లు ఆమోదం పొందడంతో 70 ఏళ్ల మాదిగల కల నెరవేరిందన్నారు. ఎస్సీ వర్గీకరణ కోసం సహకరించిన అన్ని రాజకీయ పార్టీల నాయకులకు, విద్యార్థి సంఘాల నాయకులకు ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాదిగ కళామండలి నియోజకవర్గ అధ్యక్షుడు కుక్కమూడి ముత్యాలు, నాయకులు మల్లేపల్లి నరేందర్, తరి పెద నాగయ్య, బోనిగ విద్యాసాగర్, దున్న వెంకటేశ్వర్లు, వెంకన్న, శ్రీనివాస్, జిల్లా సుమన్ తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల అభివృద్ధే ప్రభుత్వ ధ్యేయం

పెద్దవూర : గ్రామాల అభివృద్ధే ధ్యేయంగా రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం పనిచేస్తుందని జెడ్పీ మాజీ వైస్ చైర్మన్ కర్నాటి లింగారెడ్డి అన్నారు. శనివారం మండలంలోని పులిచర్ల, కోమటికుంటతండాలలో రూ.35లక్షల నిధులతో చేపట్టనున్న సీసీ రోడ్డు నిర్మాణ పనులను ఆయన ప్రారంభించి మాట్లాడారు. పులిచర్ల, కోమటికుంటతండాలలో రూ.13లక్షల ఎన్ఆర్ఈజీఎస్, రూ.22 లక్షల సీఆర్ఆర్ నిధులు మంజూరైనట్లు తెలిపారు. బీఆర్ఎస్ ప్రభుత్వం గ్రామాల్లో అభివృద్ధి పనులపై పూర్తిగా నిర్లక్ష్యం వహించిందని విమర్శించారు. ఈ కార్యక్రమంలో నాయకులు గడ్డంపల్లి వినయ్‌రెడ్డి, ఏఎంసీ డైరెక్టర్ లక్ష్మయ్య, మాజీ సర్పంచ్‌లు బిచ్చు నాయక్, శంకర్‌నాయక్, మునిలాల్, ఉపేందర్ రెడ్డి, శంకర్, బాలాజీనాయక్, బావోజీ కిషన్, ఇంద్రకంటి వెంకట్‌రెడ్డి, ఆంజనేయులు, కొండల్, అంజి, రామలింగం, శ్రీనివాస్‌రెడ్డి, ముత్యంరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



పులిచర్లలో సీసీ రోడ్డు పనులు ప్రారంభిస్తున్న కర్నాటి లింగారెడ్డి

రోగికి అరుదైన ఆపరేషన్

మిర్యాలగూడ అర్బన్ : కడుపునొప్పితో బాధపడుతున్న రోగికి అరుదైన ఆపరేషన్ చేశారు మిర్యాలగూడ వైద్యులు. వివరాల్లోకి వెళ్తే..వేములపల్లి మండలం మొల్కపట్నం గ్రామానికి చెందిన వెంకన్న మూడు రోజులుగా తీవ్రమైన కడుపునొప్పి, పసరుతో కూడిన వాంతులతో బాధపడుతూ మిర్యాలగూడ పట్టణంలోని రివర్ ఆస్పత్రికి వచ్చాడు. ఆ ఆస్పత్రిలో అతడిని పరీక్షించిన డాక్టర్ అంజిరెడ్డి రోగి కడుపులో చిన్న పేగు చెడిపోయినట్లు గుర్తించారు. అతడికి అత్యవసరంగా శస్త్ర చికిత్స చేయాలని రోగి కుటుంబ సభ్యులకు చెప్పి వారి అనుమతితో ప్రముఖ గ్యాస్ట్రో ఎంట్రాలజిస్టు సర్జన్ డాక్టర్ లోకిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి అతడి వైద్య బృందం మూడు గంటల పాటు శ్రమించి చెడిపోయిన పేగును 50 సెంటీమీటర్లు తొలగించి, ఆ ప్లేస్‌లో స్తోమ ఏర్పాటు చేశామని తెలిపారు. ప్రస్తుతం రోగి ఐసీయూలో చికిత్స పొందుతూ కోలుకుంటున్నాడని వైద్యులు పేర్కొన్నారు. అరుదైన శస్త్ర చికిత్స చేసిన వైద్యులను రోగి కుటుంబ సభ్యులు వైద్యులకు కృతజ్ఞతలు తెలిపారు.

పురాతన ఆంజనేయ స్వామి ఆలయంలో పూజలు

నిడమనూరు : మండలంలోని వేంపాడులో వెలిసిన శ్రీ భక్త ఆంజనేయస్వామి ఆలయంలో శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ ప్రాంగణంలోని చెన్నకేశవ స్వామిని, ఆంజనేయుడిని వేద బ్రాహ్మణుడు ప్రసాద్ శర్మ ప్రత్యేకంగా ఆలంకరించి ఆకుపూజ, అభిషేకాలు నిర్వహించారు. పూజ కార్యక్రమం అనంతరం ప్రసాద వితరణ, అన్నదానం నిర్వహించారు. పూజా కార్యక్రమంలో అర్వ స్వాతి, అశోక్ యాదవ్, మల్లికంటి బాలకృష్ణ, మల్లేశ్వరీ, దాసోజు సైదయ్యచారి,ఉమారాణి,మిట్టపల్లి రాంబాబు ఇందిర పాల్గొన్నారు. అన్నదానం నిర్వహించారు. వేసవిలో మిర్చికోతలకు, వరి పొలాల పనులకు వెళ్లి వచ్చే కూలీలకు అన్నదాన ప్రసాదం అందించడం అభినందనీయమని పేర్కొన్నారు.

స్వామినాథన్ కమిషన్ సూచనలు పాటించాలి

మిర్యాలగూడ అర్బన్ : వ్యవసాయ రంగ సమస్యల పరిష్కారం కోసం స్వామినాథన్ కమిషన్ సూచనలను అమలు చేయకుండా కేంద్ర ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుందని సీపీఐ అనుబంధ రైతు సంఘం జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ బంటు వెంకటేశ్వర్లు ఆరోపించారు. శనివారం స్థానిక పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ నెల 23న దేవరకొండ నియోజకవర్గంలోని చింతపల్లి జీపి రెడ్డి గార్డెన్‌లో తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం 15వ మహాసభలను జరుగుతున్నాయని అన్నారు. ఈ మహాసభకు రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పశ్య పద్మ, సీపీఐ జిల్లా పార్టీ కార్యదర్శి, శాసన మండలి సభ్యులు సత్యం, సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు నర్సింహ్మారెడ్డి, మాజీ ఎమ్మెల్యే, రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు ఉజ్జిని యాదగిరిరావులు హజరవుతున్నట్లు తెలిపారు. .

శంకర్‌నాయక్‌కు ఘన స్వాగతం



మాడుగులపల్లిలో ప్రజలకు అభివాదం తెలుపుతున్న శంకర్‌నాయక్

వేములపల్లి : ఎమ్మెల్యే కోటాలో ఎమ్మెల్సీగా ఎన్నికైన డీసీసీ అధ్యక్షుడు కెతావత్ శంకర్‌నాయక్ మాడుగులపల్లి, వేములపల్లి మండల కేంద్రాలకు రాగా ఆ మండలాల నాయకులు, కార్యకర్తలు భారీ సంఖ్యలో మాడుగులపల్లికి చేరుకోని ఆయనకు ఘనంగా స్వాగతం పలికారు. ఆయన వెంట ఎంపీ కుందూరు రఘువీర్‌రెడ్డి, ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి, డీసీసీ జనరల్ సెక్రటరీ కొండేటి మల్లయ్య, మండల అధ్యక్షులు గడ్డం వేణుగోపాల్‌రెడ్డి, మండల వర్కింగ్ ప్రెసిడెంట్ పుట్టల కృపయ్య, డీసీసీ ఉపాధ్యక్షుడు రావు ఎల్లారెడ్డి మాజీ జెడ్పీటీసీ పుల్లెంల సైదులు, వెంకన్న, పుట్టల శ్రీను, పుట్టల పెదవెంకన్న, బొంగర్ల వినోద్, పిల్లల సందీప్, సత్తిరెడ్డి, హాజీ, చంటి, గిరి తదితరులు పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్‌వీ నాయకుల ముందస్తు అరెస్ట్



తిరుమలగిరి : అరెస్టయిన బీఆర్‌ఎస్‌వీ నాయకులు

పెద్దవూర : బీఆర్‌ఎస్‌వీ ఆధ్వర్యంలో శనివారం చేపట్టిన అసెంబ్లీ ముట్టడి కార్యక్రమానికి వెళ్లకుండా నాయకులను ముందస్తు అరెస్ట్ చేశారు. ఈ సందర్భంగా బీఆర్‌ఎస్‌వీ నియోజకవర్గ ప్రధాన కార్యదర్శి రమావత్ రవినాయక్ మాట్లాడుతూ పోలీస్ వ్యవస్థను అడ్డంపెట్టుకుని అక్రమంగా అరెస్టులు చేయడం దారుణమన్నారు. ఏడాదికి రూ.2లక్షల ఉద్యోగాలు ఇస్తామని అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం కేవలం 12వేల ఉద్యోగాలు మాత్రమే భర్తీ చేసిందని తెలిపారు. అనంతరం సాయంత్రం సొంత పూచీకత్తుపై విడుదల చేశారు.

తిరుమలగిరి(నాగార్జునసాగర్) : విద్యారంగానికి బడ్జెట్ అధిక నిధులు కేటాయించాలని డిమాండ్ చేస్తూ వెళ్తున్న భారత రాష్ట్ర సమితి విద్యార్థి విభాగం నాయకులను శనివారం పోలీసులు ముందస్తుగా అరెస్టు చేసి పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఈసందర్భంగా పలువురు నాయకులు మాట్లాడారు. ముందస్తు అరెస్టులు అప్రజాస్వామికమన్నారు. అరెస్టయిన వారిలో దుబ్బ కోటేష్, మారుపాక కాశీ, కందుకూరి శివ, పెరిక వంశీ తదితరులు ఉన్నారు.

ఏనెమీదితండా వాసికి గౌరవ డాక్టరేట్



అవార్డు అందుకుంటున్న శ్రీనునాయక్ రాథోడ్

పెద్దవూర : మండలంలోని మారుమూల గిరిజన తండాకు చెందిన రమావత్ శ్రీనునాయక్ (రాథోడ్) శనివారం నర్సింగ్‌లో గౌరవ డాక్టరేట్ వరించింది. నర్సింగ్ ఉద్యోగుల సమస్యలపై తండాకు చెందిన శ్రీనురాథోడ్ జాతీయ స్థాయిలో ఆర్గనైజేషన్‌ను ఏర్పాటు చేసి కొన్నేళ్లుగా చేసిన పోరాటాలను, సేవలను గుర్తించి అమెరికాకు చెందిన వరల్డ్ హ్యూమన్ రైట్ ప్రొటెక్షన్ కమిషన్ ఆధ్వర్యంలో గౌరవ డాక్టరేట్ అవార్డు కౌన్సిల్ శనివారం న్యూఢీల్లీలో రమావత్ శ్రీను రాథోడ్‌కు గౌరవ డాక్టరేట్ అవార్డుతో సత్కరించింది. ప్రస్తుతం తెలంగాణ మెడికల్ జేఏసీ చైర్మన్‌గా వ్యవహరిస్తున్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలపై తండాలలో అవగాహన కల్పిస్తున్నారు. గౌరవ డాక్టరేట్ అవార్డు రావడం పట్ల తండావాసులు, కుటుంబ సభ్యులు, స్నేహితులు హర్షం వ్యక్తం చేశారు.

పోషక ఆహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం

గుర్రంపోడు : పోషకాహారం తీసుకోవడంలో కొందరు ప్రజలు నిర్లక్ష్యం వహిస్తున్నారని ఇన్స్టిట్యూట్ ఫర్ గ్లోబల్ డెవలప్‌మెంట్ అధికారి మనోహర్ అన్నారు. శనివారం మండలంలోని పిట్టల గూడెం జెడ్పీ ఉన్నత పాఠశాలలో ఆశీర్వాద్ స్మార్ట్ ఇండియా పోగ్రాంలో భాగంగా పోషణ్ మేళా కార్యక్రమాన్ని నిర్వహించి వివిధ ఆరోగ్య స్టాల్స్‌ను ఏర్పాటు చేశారు. సామాజిక వయోజన మహిళలకు, కౌమార బాలబాలికలకు అయోడిన్ ఉపయోగాలను బలవర్ధకమైన ఆహారపు అలవాట్లను గురించి వివరించారు. అనంతరం వివిధ ఆటల పోటీలను న్విహించి గెలుపొందిన వారికి బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఇంచార్జి హెడ్మాస్టర్ యాదగిరిరెడ్డి, పాఠశాల ఉపాధ్యాయ బృందం,సిబ్బంది వెంకన్న, సురేష్, అనురాధ, సురేష్, అంగన్ వాడీ టీచర్లు పాల్గొన్నారు.



విద్యార్థులకు బహుమతులు అందిస్తున్న నిర్వాహకులు

ఘనంగా స్నాతకోత్సవం



పట్టాలు అందుకున్న విద్యార్థులతో ఉపాధ్యాయులు

మిర్యాలగూడ : పట్టణంలోని శాంతినగర్ కాలనీలోగల వర్డ్ అండ్ డీడ్ ప్రైమరీ పాఠశాలలో శనివారం స్నాతకోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ ఎండీ కలీం మాట్లాడుతూ వివిధ తరగతులకు చెందిన విద్యార్థులు ప్రస్తుతం చదువుతున్న తరగతిని విజయవంతంగా పూర్తి చేసుకోని పాఠశాల నిర్ధేశించిన అన్ని విద్యా, పాఠ్యేతర అవసరాలను పూర్తి చేసుకొని పట్టాను తీసుకుంటారన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు హబీబా, నస్రీన్, ఆసియా, నిఖిత, సుమలత, ఫర్జానా, శిల్ప, కీర్తన, కరుణ, నాజియా, అన్నపూర్ణ, షబానా పాల్గొన్నారు.

రోడ్డు మరమ్మతులకు మోక్షం ఎప్పుడో!

కొండమల్లేపల్లి : కొండమల్లేపల్లి మండల పరిధిలోని గౌరికుంటతండా గ్రామపంచాయతీ సమీపంలో నల్లగొండ ప్రధాన రహదారిపై ఏర్పడిన గుంతలతో రాకపోకలకు తీవ్ర అంతరాయం నెలకొందని గ్రామస్తులు పేర్కొంటున్నారు. రోడ్డుపై ఏర్పడిన గుంతలతో ప్రమాదాలు జరుగుతున్నాయని ఇప్పటికైన సంబంధిత అధికారులు స్పందించి రోడ్డుకు మరమ్మతులు చేయాలని వాహనదారులు, గ్రామస్తులు కోరుతున్నారు.



గౌరికుంటతండా గ్రామపంచాయతీ పరిధిలో రోడ్డుపై ఏర్పడిన గుంతలు